## క్లుప్తంగా

### పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

**రామగుండం:** రామగుండం, అంతర్గాం మండలాల మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను సత్వరమే చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గురువారం రెండు మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆరునెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, కేసీఆర్ అల్పాహార పథకం అమలు చేసినప్పటి నుంచి నేటి వరకు నయా పైసా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని ఎంఈవోకు అందజేసిన వినతిపత్రంలో కోరామన్నారు. మధ్యాహ్న భోజన జిల్లా ప్రధాన కార్యదర్శి పూసాల రమేశ్, జి.సౌందర్య, పుష్ప, ఓదెల రమేశ్, సునీత, ఎండీ.అంజు, ఎండీ.ఫాతిమా ఉన్నారు.

### అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంబాబు

**కమాన్‌పూర్:** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి అన్ని మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని డీఎల్‌పీవో రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామాభివృద్ధి ప్రణాళికపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 22లోపు అన్నిశాఖల ప్రణాళిక నివేదికలను అందజేయాలని సూచించారు. ఫిబ్రవరి 7లోపు మండల, జిల్లాస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను ఆమోదించుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్యసూరి, ఏవో ప్రమోద్‌కుమార్, ఏఈలు రాజేంద్రకుమార్, రాధ పాల్గొన్నారు.

### నర్సరీల పరిశీలన

**కమాన్‌పూర్:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వన నర్సరీలను గురువారం ఎంపీడీవో విజయ్‌కుమార్ పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లి గ్రామానికి వెళ్లే దారి వెంట ఉన్న చెట్ల పొదలను కూలీలలో తొలగించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో శేషయ్యసూరి, కార్యదర్శులు ఉన్నారు.

### అల్ఫోర్స్‌లో రామనామం



**సుల్తానాబాద్:** ఈనెల 22న అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ ఉన్న నేపథ్యంలో సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు రామనామం ఆకారంలో నిల్చున్నారు. అయోధ్యలోని రాముని పాదాల వద్ద ప్రత్యేక పూజలు అందుకున్న అక్షింతలు ప్రతి గ్రామంలో ఇంటింటా పంపిణీ చేస్తున్న కార్యక్రమానికి తోడుగా అల్ఫోర్స్ విద్యార్థులు ఈ రకంగా తమ భక్తి భావాన్ని, తెలియజేయడం అభినందనీయమని విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కొనియాడారు అల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**ధర్మారం:** మండల కేంద్రానికి చెందిన శిరిగిరి సమ్మయ్య అలియాస్ టోనీ అక్రమంగా నిల్వ పెట్టిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం సాయంత్రం పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించనట్లు ధర్మారం ఎస్సై సత్యారాయమ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సమ్మయ్య ఇంటిలో తనిఖీ చేయగా 4.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యం వివరాలను సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించి వారి రిపోర్టు ప్రకారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

### నేత్రదానం

**మంథని:** మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన గద్దల వెంకటి గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్ ట్రస్ట్‌కు దానం చేశారు. నేత్రదానం ద్వారా ఇద్దరికి కంటిచూపు కల్పించే అవకాశం కల్పించిన వెంకటి కుమారులను పలువురు అభినందిస్తున్నారు.






### దమ్ము తీయరాని దుమ్ము

సుల్తానాబాద్ ప్రధాన ఆసుపత్రికి వచ్చే రోగులు.. పక్కనే తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు వచ్చేవారు రోడ్డుపై దుమ్ముతో దమ్ము తీయలేకపోతున్నారు. వందలాది ఇసుక లారీల రాకపోకలతో పనుల నిమిత్తం వచ్చిపోయే వారి తిప్పలు అన్నీ ఇన్నీ కావు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీలు వెళ్తుండటంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు తెలిపినా పాలకుల సూచనలతో ఆపడం సాధ్యం కాదంటున్నారని వాపోతున్నారు. ఇసుక క్వారీల నుంచి లోడ్‌తో వచ్చే వరుస లారీలతో సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పట్టణవాసుల ఇబ్బందులను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. సంబంధిత మైనింగ్ అధికారులు, పాలకులు స్పందించి బైపాస్ గుండా ఇసుక లారీలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

### కొనసాగుతున్న ఆలయాల శుద్ధి



రాగినేడులో ఆలయశుద్ధి కార్యక్రమం

**పెద్దపల్లిరూరల్:** అయోధ్యలో ఈనెల 22న రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని దేవాలయాలను శుద్ధి చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని రాగినేడు, నిట్టూరు, నిమ్మనపల్లి తదితర గ్రామాల్లో ఆలయశుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, బాస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జెన్‌కో పవర్‌హౌస్ విస్తరణ చేపట్టాలి

**గోదావరిఖని:** జెన్‌కో పవర్‌హౌస్ విస్తరణపై టీఎస్ జెన్‌కో డైరెక్టర్ అజయ్‌ను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గురువారం కలిశారు. రామగుండానికి పూర్వ వైభవం రావాలంటే బీపవర్ హౌస్‌ని 500 మెగావాట్లతో విస్తరించాలని కోరారు. ప్రస్తుతం మూతపడ్డ 62.5 మెగావాట్ల టీఎస్ జెన్‌కో విద్యుత్ ఉపకేంద్రాన్ని 500 మెగావాట్లతో విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రామగుండంలో సహజ వనరులన్నీ అందుబాటులో ఉన్నాయని, బొగ్గు, నీరు లాంటి సౌకర్యాలు స్థానికంగానే అందుబాటులో ఉంటాయన్నారు. విస్తరణ పనులు చేపడితే అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు భరోసాగా ఉంటుందన్నారు. అలాగే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

**కల్లు అడ్డాలపై దృష్టిసారించాలి**

డ్రగ్స్ కలిపి కల్లు విక్రయిస్తున్న అడ్డాలపై దృష్టిసారించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అధికారులను కోరారు. కల్లు తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే సీరియస్‌గా స్పందించి గురువారం ప్రకటన విడుదల చేశారు. దీని వెనకాల ఎంతటి వారున్నా విడిచిపెట్టేది లేదన్నారు. నియోజకవర్గంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సాధారణ పౌరుల మరణానికి కారణమైన, పౌరుల జీవితాలను, వారి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్న అక్రమ దందాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా ఎవరి ప్రాణాలు పోకుండా చూడాలన్నారు. చట్టపరంగా అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు.

## స్థానిక టిప్పర్లకు అవకాశం కల్పించాలి

**రామగుండం:** ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద రవాణాలో స్థానిక టిప్పర్లకు అవకాశం కల్పించాలని గురువారం శ్రీరామ లారీ యాష్ టిప్పర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఎన్టీపీసీ బూడిదను ఇటుక బట్టీలకు వినియోగించడంతో బట్టీ యజమానుల టిప్పర్లకు మాత్రమే రవాణాకు అనుమతించడం పట్ల స్థానిక టిప్పర్ల యజమానులకు ఉపాధి కరువైందన్నారు. ప్రతీసారి ఎన్టీపీసీ యాజమాన్యం బూడిద రవాణాపై ఆంక్షలు పెడుతుండడంపై ఆర్థికంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక టిప్పర్లకు రవాణా బాధ్యతలు అప్పగించకుంటే పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే టిప్పర్లను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై ఎన్టీపీసీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి తక్షణమే స్థానిక టిప్పర్‌లను బూడిద రవాణాకు అనుమతించాలన్నారు.



సమ్మెలో స్థానిక టిప్పర్ యజమానులు

## కార్పొరేట్ విధానాలు అనుసరిస్తున్న కేంద్రం

**కాల్వశ్రీరాంపూర్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను సీఐటీయూ ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. గురువారం కాల్వశ్రీరాంపూర్‌లో మండల కమిటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తే సహించబోమని హెచ్చరించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని, సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారాయన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, నాయకులు అంబాల రాజేందర్, అంజయ్య, లక్ష్మణ్, రాజబాబు, చల్ల రాజయ్య, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్యంరావు

## గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

**గోదావరిఖని:** గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. గురువారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26న యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో నిర్వహించే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చే కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం సివిల్ ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు పాల్గొన్నారు.

# పరిమళించిన మానవత్వం

**జ్యోతినగర్:** ఖాకీలు అంటే కారుణ్యం లేని వారు అంటారు. కానీ నేడు మానవతవాదులుగా పలువురికి సేవలందిస్తున్నారు. గురువారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి 2వ డివిజన్ ఇందిరమ్మకాలనీలో కానిస్టేబుళ్లు మల్లికార్జున్, శ్రీరామ్ విధులు నిర్వహిస్తుండగా రోడ్డు పక్కగా మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి చేతికి గాయమై అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించారు. వెంటనే అతడి వద్దకు వెళ్లి పరిశీలించారు. వెంటనే అతడి పాత దుస్తులు మార్చి స్థానికంగా ఉన్న వైద్యశాల డాక్టర్ సంతోష్‌తో అతడి చేతికి అయిన గాయానికి చికిత్స చేయించారు. అనంతరం భోజనం అందించి కాలనీలోని ఓ షెల్టర్ వద్ద ఉంచారు. మతి స్థిమితం లేని వ్యక్తి మహారాష్ట్రకు చెందిన సంతోష్‌గా గుర్తించారు. ఈసందర్భంగా కానిస్టేబుళ్లను ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్‌తో పాటు స్థానికులు అభినందించారు.



చికిత్స అనంతరం బాధితుడితో పోలీసులు

# పారిశుధ్య పనుల తనిఖీ

**సుల్తానాబాద్:** వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. గురువారం పట్టణంలోని 7, 11వ వార్డుల్లో మెయిన్ రోడ్‌లో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి డ్రైనేజీ కాలువల్లో సిల్ట్ పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను గాని ప్లాస్టిక్ వ్యర్థాలు గాని కాల్చి వేయకుండా పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

## సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**జూలపల్లి:** గ్రామీణ ప్రజలు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రాంచందర్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో గ్రామస్తులకు సైబర్ నేరాలు, చట్టవ్యతిరేక పనులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రా మాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్సై భాస్కర్, పోలీ స్ సిబ్బంది సతీశ్, మనోహర్, అత్తారోద్దీన్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## పద్మశాలీలు సమాజసేవలో ముందుండాలి

**గోదావరిఖనిటౌన్:** పద్మశాలీలు సమాజసేవలో ముందుండాలని గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన పద్మశాలీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు డీఎంను సత్కరించారు. ఆర్టీసీ సూపరింటెండెంట్ ఫైనాన్స్ కన్నం సదానందం, సంఘం నాయకులు కనకయ్య, బండి శ్రీనివాస్, ఎం.ఎల్.నారాయణ, రవీందర్, రాజవీరు, దూస సంపత్, చిప్ప మల్లేశ్, గుండేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎం నాగభూషణం

## కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న అశోక్

**యైటింక్లయిన్‌కాలనీ:** సింగరేణిలో వివిధ సెక్షన్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 22వ జీవోను గెజిట్ చేసి వేతనాలు పెంచి న్యాయం జరిగేలా ప్రస్తుత ప్రభుత్వం చూడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–2 లో కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ఐదు జీవోలు విడుదల చేసినా అందులో ఒకటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 22వ జీవోను అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. సమావేశంలో మధునమ్మ, రాజేశ్వరి, లింగయ్య, రాయమల్లు, కొమురమ్మ, స్వామి, రాణి, రజిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం**

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో గురువారం జెండాకూడలిలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా పేదలకు అన్నదానం చేశారు. క్లబ్ సభ్యుడు తొగరి శ్రీకాంత్ కుమారుడు మనస్విత్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు భిక్షపతి, అతీఫ్ , హిమాం అలీ తెలిపారు.

## గడువులోగా రుణాలు చెల్లించాలి

**మంథని:** మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలను రైతులు గడువులోగా చెల్లించాలని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు. గురువారం సంఘ కార్యాలయంలో మండలంలోని బిట్టుపల్లి గ్రామానికి చెందిన మండల ప్రకాశ్‌రెడ్డికి దీర్ఘకాలిక రుణం కింద మంజూరైన రూ.6లక్షల విలువ గల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక, ఇతర రుణాలకు సంబంధించిన బకాయిలను రైతులు త్వరితగతిన చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం డైరెక్టర్ కొత్త శ్రీనివాస్, ఎంపీటీసీ గుమ్మడి సత్యవతి–రాజయ్య, కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న శ్రీనివాస్

## సంక్షిప్త వార్తలు

**✦ ప్రారంభానికి సిద్ధంగా జీపీ భవనం**

**సుల్తానాబాద్‌రూరల్:** మండలంలోని గర్రెపల్లి నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పాలన సౌలభ్యం కోసం ఎస్ఆర్ ఈజీఎస్ కింద రూ.25లక్షలు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8.5లక్షలతో నిర్మించినట్లు సర్పంచ్ వీరగోని సుజాత తెలిపారు. వారంలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

**✦ పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ**

**రామగుండం:** పీఆర్‌టీయూ–టీఎస్ అంతర్గాం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం అంతర్గాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో సంపత్‌రావు నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు.

**✦ ఎలిగేడులో..**

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయూ టీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

**✦ చివరి భూములకు ఎస్సారెస్పీ నీరు**

**ఓదెల:** పెద్దపల్లి నియోజకవర్గంలోని రైతుల చివరి భూములకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు కృషితో డి–86 ఎస్సారెస్పీ కాలువనీరు అందుతోందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని కొలనూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ ఉన్నతాధికారుతో ఎమ్మెల్యే మాట్లాడి కాలువనీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల చివరి భూములకు కాల్వనీరు అందాయన్నారు.

**✦ గ్రామ అభివృద్ధి పనులపై సమీక్ష**

**ముత్తారం:** ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, పారిశుధ్య పనులపై ప్రణాళిక రూపొందించాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీవో బైరి వేణుమాధవ్ పాల్గొన్నారు.

**✦ దళితబంధు పథకం కొనసాగించాలి**

**ధర్మారం:** గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ రజితకు స్థానిక దళితసంఘం నాయకులు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు. నాయకులు పెర్క భానేష్, సుంచు మల్లేశం, మల్లేశం, సురేశ్, చంద్రమోహన్, మల్లేశం , దుర్గయ్య, తిరుపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

**✦ డ్రగ్స్‌కు బానిస కావొద్దు**

**పాలకుర్తి:** గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలై యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాణాపూర్‌లో అవగాహన కల్పించారు.

**✦ పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలి**

**ఎలిగేడు:** పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని సుల్తాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

**✦ మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి**

**గోదావరిఖని:** కల్తీ కల్లు అమాయక పేద ప్రజలను బలి తీసుకుంటోందని, అధికారుల పర్యవేక్షణ లోపంతో కల్తీ కల్లు అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. స్నేహితులు ఇద్దరు కల్తీ కల్లు తాగి మృతి చెందిన విషయం విదితమే. ఇద్దరి చావుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పెద్దపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతి



పెద్దపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

**పెద్దపల్లిరూరల్:** పట్టణంలో గురువారం దివంగత సీఎం స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు నిర్వహించారు. ప్రగతినగర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి అభిమాన సంఘం నాయకుడు ఉప్పు రాజు ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, గంట రాములు, సంపత్, తిరుపతి, జగదీశ్, శ్రీనివాస్, రమేశ్, మురళి, కళ్యాణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రదర్శన వీక్షిస్తున్న స్థానికులు

**మంథని:** వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంథనిలోని గాంధీచౌక్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ మండల అధ్యక్షుడు బూడిద తిరుపతి అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. నాయకులు సబ్బని సంతోష్, బోగోజు శ్రీనివాస్, నాంపల్లి రమేశ్, నారాయణ ఉన్నారు.

## ఆపదలో ఆదుకునేందుకే సీఎంఆర్‌ఎఫ్

**సుల్తానాబాద్‌రూరల్:** ఆపదలో ఉన్న నిరుపేదలను సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన పి.శ్రీనివాస్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా ఆరోగ్య ఖర్చుల కోసం రూ.2లక్షల ఎల్‌వోసీ గురువారం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. సర్పంచ్ బండారి రమేశ్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యేకు సన్మానం**

**ఎలిగేడు:** మండల కేంద్రానికి చెందిన చెల్లోజు శ్రీనివాస్‌బాబు (రూపం ఆర్ట్స్) ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానించారు. మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం కలిసి సన్మానించారు.